సాక్షి
యాదాద్రి భువనగిరి

గురువారం । 5 । అక్టోబర్ । 2023



సహకార సంఘాల రూపకర్త..
కొండా లక్ష్మణ్ బాపూజీ సహకార సంఘాల వ్యవస్థ రూపకర్త అని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. - IIIలో



కేంద్ర ఉద్యోగులుగా గుర్తించాలి
తమను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని గ్రామీణ తపాలా ఉద్యోగులు ఒక్క రోజు సమ్మె చేశారు. - IIIలో



మైనార్టీ సాయానికి రూ.90 లక్షలు
మైనార్టీలకు రూ.లక్ష ఆర్థిక సాయం కోసం జిల్లాకు కేవలం రూ.90 లక్షలు మాత్రమే విడుదలయ్యాయి. - IIIలో

న్యూస్‌రీల్

సైబర్ హైజీన్ అండ్ సెక్యూరిటీపై అవగాహన



సదస్సులోఎయిమ్స్ డైరెక్టర్, ఏసీపీ, వైద్యులు

బీబీనగర్ : మండల కేంద్రంలోని ఎయిమ్స్ వైద్య కళాశాలలో బుధవారం రాచకొండ కమిషనరేట్ సైబర్ క్రైం విభాగం ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, భద్రత తదితర అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఫ్యాకల్టీలు, నర్సింగ్ సిబ్బందికి ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా, సైబర్ క్రైం ఏసీపీ వెంకటేశం, సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్ కోఆర్డినేటర్ సావిత్రి ఇన్‌స్పెక్టర్ కిరణ్, వైద్యులు శశాంక శేఖర్ పాండా, ప్రశాంత్, శ్యామల పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

యాదగిరిగుట్ట రూరల్ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట మండలం రామాజీపేటలో బుధవారం బతుకమ్మ చీరలు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి సంవత్సరం బతుకమ్మ పండుగకు ఆడపడుచులకు కానుకగా ప్రభుత్వం చీరలు పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, ఎంపీడీఓ కారం ప్రభాకర్‌రెడ్డి, ఎంపీఓ చంద్రశేఖర్, సర్పంచ్ మొగిలిపాక తిరుమల రమేష్, ఎంపీటీసీ ఎర్ర పోచయ్య, ప్రత్యేక అధికారి సభిత, పంచాయతీ కార్యదర్శి నరేష్, యాదగిరి, ఆరె స్వామి గౌడ్, వాణి, అనురాధ, ఆంజనేయులు, నర్సింహులు పాల్గొన్నారు.

వరి చేల పరిశీలన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

గుండాల : వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ అధికారి డాక్టర్ సుధారాణి, ఏవీఆర్ డాక్టర్ మల్లారెడ్డి రైతులకు సూచించారు. బొమ్మలరామారం మండలం మరిపడిగలో రైతు పూల రాంరెడ్డి సాగు చేసిన వరి చిరు సంచుల పొలాన్ని బుధవారం పరిశీలించారు. సాగులో సస్యరక్షణ చర్యలు, ఆధునిక పద్ధతులు తప్పనిసరిగా అవలంబించాలన్నారు. అనంతరం అధిక దిగుబడి, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ మధుకర్, మమత, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

భువనగిరి : లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్ రావు హెచ్చరించారు. బుధవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జరిగిన జిల్లా అడ్వయిజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిస్తే ఆస్పత్రులను సీజ్ చేస్తామన్నారు. లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు జ్యోతి ప్రోగ్రాం ఆఫీసర్ వినోద్‌కుమార్,డీపీఆర్‌వో వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రమీల, శివలింగం, పీపీ సౌజన్య, డేమో మధుసూదన్‌రెడ్డిలు ఉన్నారు.

డీఎంహెచ్‌ఓగా పరిపూర్ణాచారి

భువనగిరి : డీఎంహెచ్‌ఓగా జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ పరిపూర్ణాచారి నియమితులయ్యారు. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డీఎంహెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న డా.మల్లికార్జున్‌రావు హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పరిపూర్ణాచారి బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఓటర్లు 4.39 లక్షలు

తుది జాబితా విడుదల
- భువనగిరి నియోజకవర్గంలో 2,11,362
  ఆలేరులో 2,27,738 మంది
- మహిళా ఓటర్లే అధికం
- ఓటరు నమోదుకు మరో అవకాశం



మహిళలు	2,19,792
పురుషులు	2,19,290
ఇతరులు	18
మొత్తం ఓటర్లు	4,39,100

భువనగిరి నియోజకవర్గంలో ఇలా..

మండలం	మహిళలు	పురుషులు	ఇతరులు	మొత్తం	పోలింగ్ స్టేషన్లు
భువనగిరి	40,720	42,159	--	82,879	99
బీబీనగర్	20,235	19,978	--	40,213	46
పోచంపల్లి	21,035	20,766	--	41,801	50
వలిగొండ	23,414	23,055	--	46,469	62
మొత్తం	1,05,404	1,05,958	--	2,11,362	257
ఆలేరు నియోజకవర్గంలో					
బి.రామారం	14,107	13,956	01	28,064	40
తుర్కపల్లి	13,361	13,297	00	26,658	39
రాజాపేట	14,333	14,307	01	28,641	40
గుట్ట	19,636	19,731	15	39,382	48
ఆలేరు	16,412	16,873	01	33,286	41
మోటకొండూరు	10,232	10,031	00	20,263	29
గుండాల	12,626	12,069	00	24,695	35
ఆత్మకూర్	12,362	11,826	00	24,188	34
వలిగొండ	1,319	1,242	00	2,561	03
మొత్తం	1,14,388	1,13,332	18	2,27,738	309

సాక్షి యాదాద్రి : అసెంబ్లీ ఎన్నికల తుది ఓటరు జాబితా విడుదలైంది. మరో రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్ బుధవారం విడుదల చేసింది. జిల్లాలో మొత్తం 4,39,100 మంది ఓటర్లు ఉన్నట్లు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి వెల్లడించారు. ఆగస్టులో ప్రకటించిన ముసాయిదా జాబితా ప్రకారం 4,27,471 మంది ఓటర్లు ఉండగా తుది జాబితాలో 4,39,100కు చేరింది. ముసాయిదా జాబితాతో పోలిస్తే తుది జాబితాలో 11,629 మంది పెరిగారు.

నియోజకవర్గాల వారీగా..
తుది జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 4,39,100 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో భువనగిరి నియోజకవర్గానికి సంబంధించి పురుషులు 1,05,404, మహిళలు 1,05,958 మొత్తం 2,11,362 మంది ఉన్నారు. ఆలేరు నియోజకవర్గంలో పురుషులు 1,14,388, స్త్రీలు 1,13,332, థర్డ్ జెండర్స్ 18 మందితో కలిపి 2,27,738 మంది ఓటర్లు ఉన్నారు.

పెరిగిన ఓటర్లు
ఎన్నికల కమిషన్ ఆగస్టులో విడదల చేసిన ముసాయిదా జాబితాతో పోలిస్తే తుది జాబితాలో 11,629 మంది ఓటర్లు పెరిగారు. వీరిలో భువనగిరి నియోజకవర్గంలో పురుషులు 1,663, మహిళలు 2,866 మంది కలిపి మొత్తం 4,529 మంది ఉన్నారు. ఇక ఆలేరు నియోజకవర్గంలో పురుషులు 3,052, మహిళలు 4,038, ఇతరులు 10 మంది మొత్తం 7,100 ఓటర్లు పెరిగారు. మొత్తం 2.65 శాతం ఓటర్లు పెరిగినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెల్లడించారు.

మహిళలే అధికం
జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. రెండు నియోజకవర్గాల పరిధిలో 4,39,100 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 2,19,290, మహిళలు 2,19,792 మంది ఉన్నారు. ఆలేరు నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

పోలింగ్ స్టేషన్లు
ఎన్నికల నిర్వహణకు గాను జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 566 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. భువనగిరి నియోజకరవ్గంలో 257, ఆలేరు నియోజకవర్గంలో 309 ఉన్నాయి.

ఓటరు నమోదుకు మరో అవకాశం
ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. 2023 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని నిర్ణయించింది. నూతన ఓటరు నమోదుతో పాటు చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించింది. సెప్టెంబర్ 28న గడువు పూర్తయ్యే నాటికి పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ప్రత్యేక బృందాలు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి విచారణ జరిపి ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించారు. అయితే అర్హతలు కలిగి ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకొని వారికి ఎన్నికల కమిషన్ మరో అవకాశం కల్పించింది. అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ గడువు 10 రోజుల ముందు వరకు ఓటు హక్కు కల్పించనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల అధికారులు కోరుతున్నారు.

2.65 శాతం ఓటర్లు పెరిగారు

సాక్షి,యాదాద్రి : తుది ఓటరు జాబితా ప్రకారం జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 4,39,100 మంది ఓటర్లు ఉన్నట్లు అదనపు కలెక్టర్ రెవెన్యూ భాస్కర్‌రావు వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో తుది ఓటరు జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రదర్శించారు. రెండవ సవరణ తుది ఓటరు జాబితా ప్రకారం 2.65 శాతం ఓటర్లు పెరిగినట్లు వెల్లడించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూరవెంకటేశ్, సయ్యద్ ముల్తానిషా, కంచర్ల రామకృష్ణారెడ్డి, ఎ.కిరణ్ కుమార్, జిట్టా వేణుగోపాలరెడ్డి, బట్టు రామచంద్రయ్య, నర్లా నర్సింగ్ రావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, కలెక్టరేటు పరిపాలన అధికారి జగన్, సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

యాదాద్రిలో విశేష పూజలు



ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు హారతినిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో బుధవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరచిన ఆచార్యులు స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం అర్చన, అభిషేకం వంటి సంప్రదాయ పూజలు గావించారు. ఇక ప్రధానాలయ ముఖ మండపంలో అష్టోత్తర పూజలు, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. రాత్రి స్వామి వారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. వివిధ పూజల ద్వారా శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.8,78,076 సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

6 నుంచి విద్యార్థులకు అల్పాహారం

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి



మర్యాల జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

బొమ్మలరామారం : ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 6నుంచి రాష్ట్ర ప్రభుత్వం అల్పాహార పథకం ప్రారంభించనుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి తెలిపారు. బొమ్మలరామారం మండలం మర్యాల జెడ్పీ హైస్కూల్ పాఠశాలలో బుధవారం డీఈఓ నారాయణరెడ్డితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులు ఖాళీ కడుపులతో తరగతులకు హాజరుకాకుండా ఉదయమే వారికి అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణ, సర్పంచ్ దామోదర్‌గౌడ్, హెచ్‌ఎం నిర్మలజ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వలిగొండ : మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అల్పాహారం పంపిణీ ఏర్పాట్లను అదనపు కలెక్టర్ రెవెన్యూ భాస్కర్‌రావు పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించనున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ నారాయణరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ శ్రీధర్, హెచ్‌ఎం సుంకోజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల జిల్లా కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గంతో టీఎన్‌జీఓ నాయకులు

భువనగిరిటౌన్: మున్సిపల్ ఉద్యోగుల జిల్లా కార్యవర్గాన్ని బుధవారం భువనగిరిలోని టీఎన్‌జీఓ భవనంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కత్తుల కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా సంతోష్, ఉపాధ్యక్షులుగా ధన్వంత్, ఖయ్యం, ఝాన్సీరాణి, కార్యదర్శిగా కె.శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా కొల్పుల రాజు, సాంబయ్య, ప్రశాంతి, కోశాధికారిగా ఉపేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గట్టు శ్రీనివాస్‌తో పాటు మరో పది మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగుల పరిష్కారానికి కృషి చేస్తాన్నారు. సమావేశానికి టీజీఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు భగత్ హాజరయ్యారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం



బీబీనగర్‌లో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

బీబీనగర్ : నియోజకవర్గంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. బీబీనగర్‌లోని పీఆర్‌జీ గార్డెన్‌లో బుధవారం బతుకమ్మ చీరలు, గృహలక్ష్మి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు, యువతకు క్రీడా కిట్‌లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు పంపిణీ చేసి మాట్లాడారు. సంస్కృతి, సంప్రదాయాలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని, అందులో భాగంగా ప్రతి సంవత్సరం బతుకమ్మ పండుగకు మహిళలకు చీరలు పంపిణీ చేస్తుందన్నారు. అదే విధంగా అర్హులందరికీ గృహలక్ష్మి పథకం కింద ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్, జెడ్పీటీసీ ప్రణీతాపింగళ్‌రెడ్డి, సర్పంచ్ భాగ్యలక్ష్మీ శ్రీనివాస్, రైతు సమితి మండల కోఆర్డినేటర్ జైపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గణేష్‌రెడ్డి, తహసిల్దార్ శ్రీధర్, ఏంపీడీవో శ్రీవాణి, మండల కోఆప్షన్ సభ్యులు అక్బర్ పాల్గొన్నారు.

భువనగిరిలోనే మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలి

భువనగిరి : జిల్లాకు మంజూరైన మెడికల్ కళాశాలను యాదగిరిగుట్టలో కాకుండా భువనగిరిలో ఏర్పాటు చేయాలని భువనగిరి డెవలప్‌మెంట్ ఫోరం(బీడీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఫోరం ఆధ్వర్యంలో భువనగిరిలోని రైతుబజార్‌లో నిరసన వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీ ఏర్పాటుకు భువనగిరిలో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని, పైగా జిల్లా కేంద్రం కావడంతో ఇక్కడే ఏర్పాటు చేయాలని కోరారు. వారికి ఎస్ఎస్ఆర్ ఒకేషనల్ కళాశాల విద్యార్థులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో బీడీఎఫ్ నాయకులు మెరుగు మధు, పూస శ్రీనివాస్, ఇమ్రాన్, ఆతహార్, దేవరకొండ నర్సింహాచారి, మాటూరి అశోక్, శోభన్‌బాబు, భాస్కర్, మల్లేష్, బాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బీడీఎఫ్ నాయకులు

నియోజకవర్గాన్ని నంబర్ వన్‌గా నిలుపుతా

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



బద్దూతండాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న గొంగిడి సునీత

తుర్కపల్లి : ఆలేరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో నంబర్ వన్ స్థానంలో నిలపడమే లక్ష్యమని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. తుర్కపల్లి మండలంలోని వెంకటాపూర్, బీల్యానాయక్‌తండా, జగ్యాతండా, బద్దూతండా, మాదాపూర్, తుర్కపల్లి, రాంపూర్‌తండా, మసీద్ ప్రాంగణం, గంధమల్ల గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్లు, గ్రామ పంచాయతీ భవనాలు, కల్వర్టులు, సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నానని తెలిపారు. ఇప్పటికే వేల కోట్ల రూపాయలతో ప్రతి పల్లెను అభివృద్ధి చేశానన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందాయన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ భూక్య సుశీలరవీందర్‌నాయక్, జెడ్పీటీసీ బీకూనాయక్, ఎంపీటీసీలు గిద్దె కరుణాకర్, సర్పంచ్‌లు కల్లూరి ప్రభాకర్‌రెడ్డి, పోగుల ఆంజనేయులు, శాగర్ల వాణిపరమేశ్, సురేశ్‌నాయక్, మల్లప్ప, మంజుల మహేందర్, మహేందర్, శ్రీనివాస్‌రెడ్డి, కోఆ ప్షన్ రహెమద్ షరీఫ్, ఉపసర్పంచ్ సీతరాజు, మార్కెట్ కమటి డైరెక్టర్లు మోతీరాం, వెంకటేశం, నాయకులు హరినాయక్, నల్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఇంటింటా జ్వరపీడితులే..

- విషజ్వరాలతో వణుకుతున్న రామన్నపేట
- ఆస్పత్రికి బాధితుల క్యూ
- రోజూ 400 వరకు ఓపీ



రామన్నపేట ఆస్పత్రిలో ఓపీ విభాగం వద్ద బారులుదీరిన రోగులు



చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

రామన్నపేట : విష జ్వరాలతో జనం వణికిపోతున్నారు. ఏ ఇంట చూసినా జ్వరపీడితులే దర్శనమిస్తున్నారు. రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి రోగులతో కిటకిట లాడుతోంది. గతంలో రోజూ 150వరకు ఓపీ వస్తుండగా వారం రోజులుగా 300 నుంచి 400 వరకు నమోదవుతోంది. బుధవారం ఒక్క రోజే 380కి పైగా అవుట్ పేషెంట్‌లు ఆస్పత్రికి వచ్చారు. పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఓపీ విభాగం వద్ద గంటల తరబడి నిరీక్షించవలసి వస్తోంది. ఆన్‌లైన్ చేసి స్లిప్ ప్రింట్ ఇవ్వడానికి సమయం ఎక్కువగా తీసుకుంటున్నట్లు రోగులు వాపోతున్నారు. ముఖ్యంగా గర్భిణులు నానా అవస్థలు పడుతున్నారు. వీరి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఓపీ చీటీలను మాన్యువల్‌గా రాసి ఇవ్వవలసి వచ్చింది.

అన్ని వార్డులు కిటకిట
జ్వరం, వాంతులు, విరేచనాలతో జనం ఆస్పత్రిలో చేరుతున్నారు. వార్డులన్నీ ఇన్‌పేషెంట్లతో కిటకిటలాడుతున్నాయి. రోగుల రద్దీ కారణంగా కాన్పుల వార్డును సైతం ఇన్‌పేషెంట్ల కోస వినియోగిస్తున్నారు. అయినా బెడ్లు సరిపడా లేకపోవడంతో ఒక మంచంపై ఇద్దరు పేషెంట్లను ఉంచుతున్నారు. బుధవారం అన్ని వార్డుల్లో 60 మంది ఇన్‌పేషెంట్లు ఉన్నారు. బెడ్ల కొరతవల్ల వ్యాధి కొద్దిగా నయం కాగానే డిశ్చార్జ్ చేస్తున్నట్లు తెలుస్తుంది.

వైద్యసిబ్బంది కొరత
ఆస్పత్రిలో డాక్టర్ల కొరత వేధిస్తోంది. 23 మంది డాక్టర్లకు గాను నలుగురే పని చేస్తున్నారు. డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఇద్దరు సివిల్ సర్జన్లు (పిడియాట్రిక్, గైనకాలజిస్ట్), ఒక అసిస్టెంట్ సివిల్ సర్జన్ (పిడియాట్రిక్), ఒక జనరల్ డ్యూటీ మెడికల్ డాక్టర్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 23 మంది డాక్టర్లకు గాను నలుగురే ఉండడంతో అదనపు భారంతో అలసిపోతున్నారు. వారానికి మూడురోజులు నైట్ డ్యూటీ చేయవలసి వస్తుందని, సెలవులు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఒకే బెడ్‌పై చికిత్స పొందుతున్న ఇద్దరు చిన్నారులు

మెరుగైన సేవలందిస్తున్నాం



వైద్యుల కొరత ఉన్నప్పటికీ అందుబాటులో ఉన్నసిబ్బందితో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. అవుట్ పేషెంట్లు, ఇన్‌పేషెంట్లు రోజు రోజుకూ పెరుగుతున్నారు. అయినా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి.

-బి.వీరన్న, ఆస్పత్రి సూపరింటెండెంట్


బెడ్‌లు సరిపడా లేవు



పాపకు జ్వరం వస్తే రెండు రోజుల క్రితం రామన్నపేట ఆస్పత్రికి తీసుకువచ్చాను. జ్వరం ఎక్కువగా ఉండడంతో వైద్యులు ఆస్పత్రిలో చేర్చుకున్నారు. ప్రస్తుతం గ్లూకోజ్‌లు ఎక్కుతున్నాయి. బెడ్లు సరిపోను లేకపోవడంతో మా పాప మంచంపై మరో అమ్మాయిని ఉంచి చికిత్స అందజేస్తున్నారు. వైద్యం మంచిగనే ఉంది.

-సంధ్య, గోకారం

రోగుల తాకిడి పెరిగింది



విష జ్వరాల కారణంగా ఆస్పత్రికి రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నారు. బాధితుల్లో అధికంగా జ్వరపీడితులే ఉంటున్నారు. అస్పత్రిలోని అన్ని వార్డులు జ్వరపీడితులతో నిండిపోయాయి. బెడ్లు సరిపోవడం లేదు. రోగులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఎలాంటిఇబ్బంది కలుగకుండా చూస్తున్నాం.

-సువర్ణ, హెడ్ నర్సు

క్లుప్తంగా

వృద్ధురాలి బలవన్మరణం

గుర్రంపోడు : పురుగుల మందు తాగి ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని నడికూడ గ్రామంలో బుధవారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన కట్టిబోయిన సైదమ్మ (65) మంగళవారం రాత్రి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు నల్లగొండ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆరోగ్య సమస్యలతోపాటు గత కొంతకాలంగా కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు వారు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పెద్దఅడిశర్లపల్లి : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. గుడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గుడిపల్లి మండలంలోని మాదాపురం గ్రామానికి చెందిన రమావత్ నరేష్(30) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలతో గత నెల 29న పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.మృతుడి తల్లి దేవ్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి తల్లి, భార్య ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి

రామన్నపేట : అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని వెల్లంకి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బండ్ల మంగమ్మ(70)కు ముగ్గురు కుమారులు, కుమార్తె కలరు. మంగళవారం రాత్రి 10గంటల సమయంలో మంగమ్మ ఇంటి ముందున్న నీటిసంపులో పడింది. కుటుంబసభ్యులు, ఇరుగు పొరుగువారు గమనించి సంపులో నుంచి బయటకు తీసి చూడగా అప్పటికే మృతి చెందింది. కుటుంబ సభ్యులు బుధవారం అంత్యక్రియలకు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి రెండవ కుమారుడు పాండు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ఎం.లక్ష్మయ్య తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగికి గాయాలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న జాకబ్‌కు ప్రమాదవశాత్తు బస్సు నుంచి జారీ పడటంతో గాయలయ్యాయి. స్థానిక ఆర్టీసీ ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్యారేజీలో విధులు నిర్వహిస్తున్న జాకబ్ రోజు మాదిదిరిగానే బస్సుకు సంబంధించిన రిపేర్ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో బస్సు ఎక్కేందుకు యత్నించగా జారీ కింద పడ్డాడు. ఈ సమయంలోనే బస్సు రేకు తగలడంతో గాయలయ్యాయి. వెంటనే ఆర్టీసీ ఉద్యోగులు జాకబ్‌ను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

సఖ్యతకు అడ్డొస్తున్నాడనే..

- ప్రియుడు, మరొకరితో కలిసి భర్తను హత్య చేయించిన భార్య
- నిద్రిస్తున్న వ్యక్తి గొంతు నులిమి ఘాతుకం
- ముగ్గురు నిందితుల అరెస్ట్, రిమాండ్



హతుడు చాంప్లతో భార్య అరుణ ముగ్గురు పిల్లలు(ఫైల్)

అర్వపల్లి: సఖ్యతకు అడ్డొస్తున్నాడన్న కారణంతోనే ప్రియుడు మరొకరితో కలిసి భర్తను భార్య హత్య చేయించినట్లు పోలీసుల విచారణలో తేలింది. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం నాణ్యతండా ఆవాసం పూర్యాతండా సమీపంలో గత నెల 24న చోటు చేసుకున్న హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. నాగారం సీఐ కె.శివశంకర్, అర్వపల్లి ఎస్ఐ అంజిరెడ్డి బుధవారం తెలిపిన కేసు వివరాలు ఇలా ఉన్నాయి. నూతనకల్ మండలం బక్కహేమ్లాతండాకు చెందిన గుగులోతు చాంప్ల జాజిరెడ్డిగూడెం మండలం నాణ్యతండా ఆవాసం పూర్యాతండా సమీపంలోని గుట్టల పక్కన కొంత కాలంగా తన వ్యవసాయ భూమిలో బొగ్గు బట్టీలు నడుపుతున్నాడు. గత నెల 24న రాత్రి చాంప్ల తన భార్య అరుణ, కుమారుడు ధనుష్ ముగ్గురు కలిసి బైక్‌పై తమ తండా నుంచి బొగ్గు బట్టీల వద్ద గుడిసెలో పడుకున్నారు. ఒక మంచంలో చాంప్ల, మరో మంచంలో ఆయన భార్య, కుమారుడు నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి దాటాక చాంప్ల భార్య అరుణ, ఆమె ప్రియుడైన అదే తండాకు చెందిన గుగులోతు వీరన్న, మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామానికి చెందిన పిప్పాల రాంమ్మూర్తి ముగ్గురు కలిసి చాంప్లను గొంతునులిమి కొట్టి హత్య చేశారు. ఈ సమయంలో మంచంలో నిద్రిస్తున్న చాంప్ల కుమారుడు ధనుష్ తండ్రి హత్యను చూసి తాతకు ఫోన్‌చేయడానికి ప్రయత్నించగా అరుణ కుమారున్ని పడుకోమని చద్దరు కప్పి పడుకోబెట్టింది. అయితే మరుసటి రోజు ఉదయం అరుణ ఏమి తెలియనట్లుగానే భర్త శవంపై పడి ఏడుస్తుండగా చుట్టు పక్కల వారు చూసి తండా వాసులకు సమాచారం అందించారు.

ఆరు నెలలకు ముందే హత్యకు పథకం

చాంప్ల, అరుణలు ఇద్దరు క్లాస్‌మేట్లు. ఇద్దరు చదువుకున్న రోజుల నుంచే ప్రేమించుకున్నారు. పెద్దలను ఒప్పించి 12ఏళ్ల కిందట పెళ్లి చేసుకున్నారు. ఇద్దరు కుమార్తెలు, కుమారుడు జన్మించారు. అరుణ పెళ్లికి ముందు నుంచే అదే తండాకు చెందిన నిందితుడు గుగులోతు వీరన్నతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తోంది. పెళ్లి అయ్యాక కూడా అరుణలో మార్పు రాక పోవడంతో భార్య భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. పెద్ద మనుషుల వద్ద పంచాయితీ కూడా పెట్టారు. అయినా అరుణ తన తీరును మార్చుకోలేదు. అయితే తన వివాహేతర సంబంధానికి భర్త అడ్డువస్తున్నాడని, మద్యం సేవించి తనను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని అరుణ తన ప్రియుడు వీరన్నకు చెప్పడంతో 6 నెలల కిందట నుంచే చాంప్లను హత్య చేయాలని పథకం వేశారు. అప్పటి నుంచి ప్రయత్నిస్తూ చివరకు గత నెల 23న అరుణ వీరన్నకు ఫోన్‌చేసి ఎప్పుడు వస్తున్నావు చాంప్లను చంపడానికి అని అడగ్గా.. నా సేహితుడు రాంమ్మూర్తిని వెంటతీసుకొని వస్తానని అతనికి రూ.4 లక్షలు ఇస్తానని మాట్లాడినట్లు ఫోన్‌లో అరుణకు వీరన్న తెలియజేశాడు. అదే ప్రకారం మరుసటి రోజు రాత్రి వీరన్న రాంమ్మూర్తి భార్య కళ్లెదుటే నిద్రలో ఉన్న చాంప్ల మీద రాంమ్మూర్తి కూర్చొని చేతులు పట్టుకోగా, వీరన్న చాంప్ల గొంతు పట్టుకొని గట్టిగా ముక్కు నోరు మూసి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అయితే సంఘటనా స్థలిలో అరుణ ధరించిన పగిలిన గాజుముక్కలను ఆరోజే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితులకు చెందిన రెండు జతల చెప్పులు, ద్విచక్రవాహనం, 3సెల్‌ఫోన్లు పట్టుకుని సీజ్‌చేశారు. చాంప్ల భార్య అరుణ, ప్రియుడు వీరన్న, ఆయన స్నేహితుడు రాంమ్మూర్తి ముగ్గురిని బుధవారం తండాలోనే అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్‌కు పంపారు. కాగా ఈ కేసు పరిశోధనలో కానిస్టేబుల్ ఉమామహేష్, హోంగార్డు సీహెచ్. అశోక్‌లు తమకు సహకరించారని సీఐ, ఎస్సైలు తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



రవినాయక్ (ఫైల్)

తుర్కపల్లి: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తుర్కపల్లి మండలం దయ్యబండ తండాలో బుధవారం చోటు చేసుకుంది. తండాకు చెందిన వాంకుడోత్ రవినాయక్ (28) గ్రామంలో బియ్యం వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. ఏడాది క్రితం ఇంట్లో భార్య బండలు కడిగుతోంది. ఈ క్రమంలో రవినాయక్ బయట ఉన్న బియ్యం బస్తాలను ఇంట్లోకి మోసుకోస్తున్న క్రమంలో కాలు జారి బండలమీద పడిపోయాడు. దీంతో అతడి వెన్నపూసకు బలంగా గాయం కావడంతో హైదరాబాద్‌కు తరలించి వైద్యం చేయించారు. అప్పటి నుంచి రవినాయక్ రెండు కాళ్లకు స్పర్శలేక పనిచేయలేదు. నాటి నుంచి ఇంటిపట్టునే ఉంటున్నాడు. భార్య ప్రమీల భర్తకు సపర్యలు చేస్తూ, ఇంటి దగ్గర కిరాణ దుకాణం నడుపుతోంది. కొద్దిరోజుల క్రితం రవినాయక్ మూడు చక్రాల వాహనాన్ని కొనుగోలు చేసుకున్నాడు. ఈ తరుణంలో మంగళవారం రవినాయక్ సాయంత్రం స్కూటీ పైన మండల కేంద్రానికి వెళ్లా. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో భార్య ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది, దీనితో బంధువులకు, తండా వాసులను రవినాయక్ కోసం ఆరా తీసిన ఆచూకీ తెలియరాలేదు. దీంతో రవినాయక్ భార్య భర్త కనబడడం లేదని మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బుధవారం ఉదయం ఫోన్ లొకేషన్ ఆధారంగా రవినాయక్ వీరారెడ్డిపల్లి గ్రామ శివారులో ఉన్నడని గుర్తించారు. వెంటనే తండ వాసులు, బంధువులు వెళ్లి చూడగా అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు.అతడిని భువనగిరి ఆస్పత్రికి, అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. ఫోన్‌లో చూడగా మంగళవారం సాయంత్రమే పురుగుల మందు తాగుతున్నప్పుడు తీసుకున్న వీడియో ఉంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

ఆకుపాముల వాసికి జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న సుధాకర్ గౌడ్

మునగాల(కోదాడ): మండలంలోని ఆకుపాముల గ్రామానికి చెందిన బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సామాజిక ఉద్యమకారుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్ ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని బోగులకుంటలోని తెలంగాణ సరస్వతీ పరిషత్ వేదికలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఇండియా ఎన్జీవో ఫౌండర్, చైర్మన్ డా. ఆకుల రమేష్ , స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ట్రెజరర్ మంజుల చేతుల మీదుగా సుధాకర్ గౌడ్ అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో స్ఫూర్తి సర్వీసెస్ ట్రెజరర్ మంజుల ,లయిన్ డా.గడ్డుపల్లి శ్రీనివాసరావు, లయన్, డా.యాదయ్య గౌడ్, డా.సీతరాజ్ కుమార్, విమరశెట్టి రవీందర్ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం 5,089 పోస్టులతో వేసిన మినీ డీఎస్సీ నోటిఫికేషన్ రద్దుచేసి, గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించిన 13,089 పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 5 సంవత్సరాల తర్వాత 6 లక్షల మంది అభ్యర్థులకు 5వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ వేయడం దారుణమన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల, నిరుద్యోగుల ఆశలన్ని అడియాశలే అయ్యాయన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, సందీప్, శ్రీకాంత్, జస్వంత్, అరవింద్, మహేందర్, మధుకిరణ్ పాల్గొన్నారు.

బైక్, ఆటో ఢీ.. యువకుడి దుర్మరణం



మల్లేష్ (ఫైల్)

గుండాల : బైక్ అదుపు తప్పి ఆటోను వెనుక నుంచి ఢీ కొట్టడంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన గుండాల మండలంలోని అనంతారం గ్రామంలో బుధవారం జరిగింది. అనంతారం గ్రామానికి చెందిన బొంగు మల్లేష్ (25), పాచిల్ల గ్రామానికి చెందిన పందుల రామకృష్ణ స్వగ్రామం నుంచి బైక్‌పై గుండాలకు వస్తున్న క్రమంలో ముందుగా వెళుతున్న గ్యాస్ ఆటోను వెనుక నుంచి ఢీ కొట్టడంతో కింద పడిపోయారు. ప్రమాదంలో బొంగు మల్లేష్‌కు తీవ్ర, పందుల రామకృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి. బాటసారులు ఇచ్చిన సమాచారం మేరకు కుటుంబ సభ్యులు 108 వాహనంతో ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే బొంగు మల్లేష్ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు వలంటీర్ల ఎంపిక



ఎంపికైన వలంటీర్లు

ఎంజీయూ(నల్లగొండ రూరల్) : వెస్ట్ జోన్ ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు ఎన్ఎస్ఎస్ వలంటీర్లను బుధవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఎంపిక చేసినట్లు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి తెలిపారు. వలంటీర్ల నైపుణ్యాలను పెంచే దిశగా కేంద్ర క్రీడల, యువజన సర్వీస్‌ల శాఖ ప్రోత్సహి స్తున్నట్లు వివరించారు. వివిధ అంశాల్లో ప్రావీణ్యం ఉన్న వారిని ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్ఎస్ఎస్ డిప్యూటీ ఆఫీసర్ గీత, యూత్ ఆఫీసర్ సైదా నాయక్, పీఓలు మాధవి, మీనమ్మ, భావన, మురళి ,శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అవగాహన

గరిడేపల్లి : వ్యవసాయ డిగ్రీ విద్యార్థులకు విస్తరణ కార్యక్రమాలపై సరైనా అవగాహన ఉన్నప్పుడే క్షేత్రస్థాయిలో అనుభవం పొందగలుగుతారని కేవీకే శాస్త్రవేత్త, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ బి. లవకుమార్ అన్నారు. బుధవారం గరిడేపల్లి మండలం గడ్డిపల్లి కేవీకేలో విద్యార్థులకు వ్యవసాయ విస్తరణ నిర్వహణపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇటీఎం మండసూర్ తదితరులు పాల్గొన్నారు.

వరి పంటను కాపాడుకోవడానికి..

- జనరేటర్‌తో నీరు పెడుతున్న రైతు



రామలక్ష్మీపురంలో జనరేటర్‌తో బోరును నడిపిస్తున్న రైతు

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని రామలక్ష్మీపురం గ్రామానికి కొప్పుల సాగర్‌రెడి చేతికొచ్చిన వరిపంటను ఎండిపోకుండా కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు. రైతు తన బావికింద ఐదు ఎకరాలు, బోరు సాయంతో మరో నాలుగు ఎకరాలు వరి సాగు చేశాడు. బోరు కింద సాగు చేసిన వరికి విద్యుత్ అంతరాయంతో నీరు సరిపోవడం లేదు. లక్షల రూపాయల పెట్టుబడి పెట్టి సాగు చేసిన వరి ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. మరో మూడునాలుగు తడులు(నీరు) ఇస్తే పంట ఇంటికి చేరుతుందనే నమ్మకంతో బంధువుల జనరేటర్‌ను తీసుకొచ్చి ట్రాక్టర్ సహాయంతో బోరుకు అమర్చి నడిపిస్తున్నాడు. ఎకరం వరి పొలం పారేందుకు మూడునాలుగు గంటలు పడుతుందని, గంటకు మూడు లీటర్ల డీజిల్ అవసరం అవుతుందని రైతు తెలిపాడు. రైతులకు ఈ బాధలు తప్పాలంటే అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సాగర్ నీటిని ఒక్కసారి విడుదల చేయిస్తే సాగు చేసిన పంటలు చేతికొస్తాయని సాగర్‌రెడ్డి చెబుతున్నాడు.

వైభవంగా నృసింహుడి నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి ఆలయంలో రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, నిత్యాగ్నిహోత్రి, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్రనామార్చన తదితర పూజలు చేశారు. అనంతరం ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రక్తికట్టించారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచణం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ గావించారు. అనంతరం భక్తులను తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు పద్మనాభాచార్యులు, లక్ష్మీనర్సింహమూర్తి పాల్గొన్నారు.

గాలి గోపురానికి స్టోన్ పెయింటింగ్

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ కొండకు దిగువన మెట్ల దారిలో ఉన్న వైకుంఠ ద్వారం గాలి గోపురాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ఆలయాధికారులు సన్నాహాలు చేపట్టారు. ఇందులో భాగంగానే గాలి గోపురం మరింత ఆకర్షణీయంగా భక్తులకు కనిపించేలా కృష్ణశిల రాయి రంగు కలిగిన స్టోన్ పెయింటింగ్‌ను వేస్తున్నారు. ప్రస్తుతం గాలి గోపురం వద్ద నుంచే భక్తులు అధిక సంఖ్యలో వెళ్తున్న నేపథ్యంలో ఈ స్టోన్ పెయింటింగ్ పనులను అధికారులు చేపట్టినట్లు తెలుస్తోంది. ఇందు కోసం భారీ పరంజాను ఏర్పాటు చేసుకొని శిల్పులు పనులు చేస్తున్నారు.

అధికారంలోకి రాగానే స్కీములు అమలు

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

చిలుకూరు: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని , అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీములను అమలు చేస్తామని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. బుధవారం సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని రామాపురం గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో దేశంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో డిసెంబర్‌లో ఎన్నికలు జరుగుతాయని ఆ ఎన్నికల్లో అవినీతి బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 70 సీట్లుకు పైగా గెలవడం పక్కా అని అన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలు అవినీతిమయంలో కూరుకుపోయారని ఆరోపించారు. ఎక్కడ చూసినా ఎమ్మెల్యే ల్యాండ్, శ్యాండ్, మైన్స్, వైన్స్ దందాలో ఉన్నారని విమర్శించారు. దళితబంధులో లబ్ధిదారులకు కంటే ఎక్కువ మొత్తంలో కమీషన్లు 70 శాతం మధ్యవర్తులకే పోతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యా యత్నం


గుండాల : గడ్డి మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన గుండాల మండలంలోని తుర్కలశాపురం గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పురుగుల మల్లేషం (22) ఇటీవల ప్రమాదానికి గురయ్యాడు. బుధవారం గడ్డి మందు తాగి ఇంట్లో అపస్మారక స్థితిలో పడిపోవడంతో కుటుంబ సభ్యులు గమనించి అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి (నల్లగొండ) : నల్లగొండ జిల్లాలోని ఎస్సీ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆర్సీఓ అరుణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ల్యాబ్ అసిస్టెంట్లు 2, కంప్యూటర్ అసిస్టెంట్ 1 పోస్టులు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. ల్యాబ్ అసిస్టెంట్ పోస్టుకు బీఎస్సీ ఫిజికల్ సైన్స్, లైఫ్ సైన్స్, కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టులు బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 5 నుంచి 10వ తేదీలోపు నల్లగొండ ఆర్సీఓ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 08682 223898ను సంప్రదించాలని సూచించారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- నడిగూడెం ఏఓ రాజగోపాలరావు



ఎం.రాజగోపాలరావు, వ్యవసాయాధికారి

నడిగూడెం : ప్రస్తుతం పత్తి చేలు పూత, పిందె దశల్లో ఉన్నాయి. ఇలాంటి సమయంలో ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు పాటించాలని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం .రాజగోపాలరావు చెబుతున్నారు.

ఆశించే పురుగులు.. నివారణ చర్యలు

కాండం తొలుచు పురుగు : ఈ పురుగు లార్వాలు పత్తి మొక్క కాండాన్ని భూమి నుంచి అడుగున్నర దూరంలో తొలిచి కాండం మధ్య భాగాన్ని మొత్తాన్ని తినేస్తాయి. పురుగు ఆశించిన పత్తి మొక్కల దగ్గర రంపపు పొట్టు లాగా పడి ఉండడం గమనించవచ్చు. పురుగు ఆశించినపుడు కాండం బలహీనమై, కొమ్మలు విరుగుతాయి. క్రమేపి మొక్క చనిపోతుంది. పురుగు ఉనికిని గమనించిన వెంటనే లార్వాను ఏరివేసి నాశనం చేయాలి. ఈ పురుగు జూన్ నుంచి అక్టోబరు మాసంలో అధిక ఉష్ణోగ్రతలు వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పుడు గమనించవచ్చు. దీని నివారణకు ఆక్సీడెమటాల్ మిథైల్ (మెటాసిస్టాక్స్) 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసినట్లయితే పురుగు ఉధృతి కొంత వరకు తగ్గుతుంది.



సాగులో ఉన్న పత్తి

శనగపచ్చ పురుగు

తల్లిపురుగు మొక్క లేత భాగాలపై తెల్లని గుండ్రని గుడ్లను విడివిడిగా పెడుతుంది. గుడ్ల నుంచి పొదగబడిన చిన్న లార్వాలు ఆకులు, గూడ, పూత మరియు కాయలను చిన్న రంధ్రాలు చేసి నష్టపరుస్తాయి. లార్వా ముందుగా తలను పూత, కాయలలోనికి చొప్పించి మిగతా శరీర భాగాన్ని బయట ఉంచి తింటుంది. కాయకు చేసే రంధ్రం గుండ్రంగా పెద్దగా ఉంటుంది. పురుగు ఆశించిన మొగ్గలు, పూత రాలిపోతాయి. ఈ పురుగు ఆశించిన పూల విచ్చుకొని కనిపిస్తాయి. పచ్చ పురుగు గుడ్లు ఎక్కువగా ఉంటే ప్రొఫెనోఫాస్ 2 మి.లీ.లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లేదా ట్రైజోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు లీటరు నీటికి ఇండాక్స్‌కార్బ్ 1 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రా. లేదా ఫ్లూబెండమైడ్ 0.3.మి.లీ.లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3. మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. జీవ రసాయనాలైతే 5 శాతం వేప గింజల కషాయాన్ని పిచికారీ చేయాలి. ఎకరానికి నాలుగు లింగాకర్షక బుట్టలు పెట్టి పురుగు ఉధృతిని గమనించాలి. ఎకరానికి 100 బంతి మొక్కలను ఎర పంటగా నాటాలి.

పాడి పంట

పొగాకు లద్దె పురుగు

ఈ పురుగు పైరును అన్ని దశల్లో ఆశించి బాగా నష్టపరుస్తుంది.తల్లి పురుగు ఆకుల అడుగు భాగాన ఒకే దగ్గర గుంపుగా గుడ్లను పెడుతుంది. గుడ్ల నుంచి వచ్చిన చిన్న చిన్న లార్వాలు ఆకుల అడుగున గుంపులుగా చేరి ఆకులోని పత్రహరితాన్ని గీకి తింటాయి. లార్వా దశలు పెరిగే కొద్ది విడివిడిగా ఆకులను కొరికి తిని ఈనెలను మాత్రమే మిగులుస్తాయి. వీటినే జల్లెడ ఆకులు అంటారు. ఈ లార్వాలు మొగ్గలు, పువ్వులు, కాయలను ఆశించి నష్టపరుస్తాయి. పగటి పూట ఇవి మొక్కల మొదళ్లలో భూమి లోపల ఉండి రాత్రి పూట నష్టం కలుగచేస్తాయి.

నివారణ ఇలా..

మూడవ దశ దాటిన లద్దె పురుగును అదుపు చేయడానికి విషపు ఎర వాడాలి. ఎకరానికి 10కిలోల తవుడు, 2కిలోల బెల్లంతో పాటు 1లీటరు మోనోక్రోటోఫాస్ లేదా 750 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేదా 300 గ్రాములు థయోడికార్బ్ మందు సరిపడు నీటిని కలిపి మిశ్రమం పులిసిన తర్వాత చిన్న చిన్న ఉండలుగా చేసుకొని సాయంత్రం సమయంలో పొలమంతా చల్లాలి. నోవాల్యురాన్ 1 మి.లీ లేదా లుఫెన్యురాన్ 1.25 మి.లీ.లేదా థయోడికార్బ్ 1.5 గ్రా.లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. జీవ రసాయనాలు అయితే 5శాతం వేపగింజల కషాయాన్ని పిచికారీ చేయాలి. ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు పెట్టి పురుగు ఉధృతిని గమనించాలి. ఎకరానికి ఎర పంటగా 20 ఆముదం మొక్కలను వేయాలి.

ఆశించే తెగుళ్లు.. నివారణ చర్యలు

వేరుకుళ్లు తెగులు భూమిలో తేమ అధికంగా ఉన్నప్పుడు ఈ తెగులు పైరు అన్ని దశలలో కనబడుతుంది. లేత మొక్కలు అర్థంతరంగా ఎండిపోయి చనిపోతాయి. వడలిపోయిన ఆకులు చాలా కాలం వరకు చెట్టుపై నుండి క్రిందకు వేలాడుతూ ఉంటాయి. కిలో విత్తనానికి 2 గ్రాములు కార్బెండిజిమ్ లేదా 10 గ్రాములు ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బెండిజిమ్ 1 గ్రాము లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని తెగులు సోకిన మొక్కల పాదుల చుట్టూ నేలపై పోయాలి.

తలనత్త : తల్లి పురుగు గుడ్లను ఒక్కొక్కటిగా గూడమీద, కొమ్మలు మీద, లేత ఆకుల మీద పెడుతుంది. ఈ పురుగుల లార్వాలు లేత కొమ్మలను, పూమొగ్గలను, కాయలను తొలచి నష్టం కలుగచేస్తాయి. చిన్న లార్వాలు మొక్కల చివర్లను తొలిచి తినడం వలన కొమ్మల చివర్లు వడలి ఎండిపోతాయి. దీనిని తలనత్త అంటారు. దీని నివారణకు క్వినాల్‌ఫాస్ 2 మి.లీ లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ట్రైజోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. లేదా వేప గింజల కషాయం ఐదు శాతం పిచికారి చేయాలి.

ఎండు తెగులు

ఎండు తెగులు లక్షణాలు ఏ దశలోనైనా కన్పించవచ్చు. మొలక దవలో ఆశించినప్పుడు నానుడు తెగులు లక్షణాలు కన్పిస్తాయి. ఎదిగిన మొక్కలలో పుష్పించే దశలో ఈ తెగులు ఎక్కువగా కన్పిస్తుంది. తెగులు సోకిన మొక్కలు ఆకులు వాడిపోయి మొదట ఈనెల మధ్య పసుపు రంగుగా. తదుపరి ఎర్రగా మారి ఆకులు కింద నుంచి పైకి ఎండుకుంటూ రాలిపోతాయి. కొమ్మలను చీల్చి చూస్తే లోపల నల్లని బూజుతో చారలు కన్పిస్తాయి. కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బెండిజిమ్ 1 గ్రాము నీటికి కలిపిన ద్రావణాన్ని తెగులు సోకిన మొక్కల పాదుల చుట్టూ నేలపై పోయాలి.